నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 9 ఆగస్టు 2024 | SANGAREDDY


రుణమాఫీ కాలేదని సంగారెడ్డిలోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు


తుక్కాపూర్ పంప్‌హౌస్ నుంచి మల్లన్నసాగర్‌లోకి వెళ్తున్న గోదావరి జలాలు

# రైతుల గ్రీవెన్స్ బాట.. !

## రుణమాఫీ గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదుల వెల్లువ

- ఉమ్మడి మెదక్ జిల్లాలో 7,836కు పైగా ఫిర్యాదులు
- సిద్దిపేట జిల్లాలో 2,479, మెదక్‌లో 2,519..
- సంగారెడ్డిలో 2,838 గ్రీవెన్‌సెల్‌కు రైతుల అర్జీలు
- ఇది అధికారిక లెక్కలు...అంతకన్న ఎక్కువగానే...
- వచ్చిన ఫిర్యాదులను అప్‌లోడ్ చేసి కమిషనరేట్‌కు పంపుతున్న అధికారులు
- రుణమాఫీ అవుతుందా..లేదా..అని రైతుల్లో ఆందోళన


నంగునూరు మండలం జేపీతండాలో రుణమాఫీ కాలేదని ఏఈవోకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

సిద్దిపేట, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రుణమాఫీ కాని రైతులంతా జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదులు చేస్తున్నారు. రెండు విడతల్లో రుణమాఫీ కాని వారంతా గ్రీవెన్స్‌సెల్ బాట పట్టారు. అన్ని అర్హతలు ఉన్నా తమకు రుణమాఫీ ఎందుకు కాలేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రెండు విడతలుగా చేసిన రుణమాఫీలో మాఫీ కాని రైతులు ఇప్పటివరకు 7,836 మంది గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం సిద్దిపేట జిల్లాలో 2,479 మంది, మెదక్ జిల్లాలో 2,519 మంది, సంగారెడ్డి జిల్లాలో 2,838 మంది రైతులు ఫిర్యాదు చేశారు. రైతులు గ్రీవెన్ సెల్‌కు చేసుకున్న ఫిర్యాదులను పరిశీలించి వాటిని అప్‌లోడ్ చేసి రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపుతున్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో చాలా క్షేత్రస్థాయిలోనే తిరస్కరిస్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. తాము కమిషనరేట్‌కు పంపడం వరకు తమ డ్యూటీ అని, ఆ తర్వాత రుణమాఫీ అవుతుందా.. ? కాదా ..? అనేది మాకు సంబంధం లేదు. ఇది వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్న మాట. దీంతో రైతుల్లో ఒక రకమైన ఆందోళన వెంటాడుతుంది. తమకు రుణమాఫీ అవుతుందా..? లేదా అని ఎదురుగా వచ్చిన ప్రతి అధికారిని అడుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రీవెన్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదులపై ఎటు వంటి స్పష్టమైన ప్రకటన చేయలేదు. అర్హత ఉన్న రైతులకు తప్పనిసరిగా రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


సిద్దిపేట కలెక్టరేట్‌లో రైతు రుణమాఫీపై గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసిన అధికారులు

### అర్హులకు రుణమాఫీ అయ్యేనా.. ?

కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసినట్లు గొప్పలు చెబుతోంది. కానీ ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. అనేక కొర్రీలు పెట్టి రైతులతో చెలగాటం ఆడుతోంది. అర్హత ఉన్న వారు రుణమాఫీ కాకపోతే జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్ సెల్‌కు ఫిర్యాదులు చేయవచ్చని చెప్పింది. దీంతో రుణమాఫీ కాని రైతులు గ్రీవెన్‌సెల్‌కు ఫిర్యాదు చేస్తే ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదు. మండల కేంద్రాల్లోని ఏఈవోల ద్వారా గ్రీవెన్ సెల్‌కు రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తమకు రుణమాఫీ ఎందుకు కాలేదని అడిగితే తాము వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు ఫిర్యాదును పంపడం వరకే తమ డ్యూటీ అని అధికారులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. రెండు విడతలుగా ప్రభుత్వం రుణమాఫీ చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 2,32, 014 మంది రైతులకు రూ.1,596.38 కోట్ల రుణాలు మాఫీ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. అనేక కొర్రీలు పెట్టి ఈ రుణమాఫీ చేసింది. 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 9 తేదీ వరకు బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు మాత్రమే రుణమాఫీ కటాఫ్ పెట్టింది. తొలి విడతలో జూలై 18న లక్ష రూపాయల వరకు, జూలై 30న లక్షన్నరలోపు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. కానీ రుణమాఫీలో ప్రభుత్వ నిబంధనలు, టెక్నికల్ సమస్యలతోపాటు రేషన్ కార్డు, రుణఖాతా క్లోజ్ కావడం తదితర సమస్యలతో చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదు. తొలి విడత, రెండో విడతలో రుణమాఫీ కాని రైతులు గ్రీవెన్‌సెల్‌కు దరఖాస్తు చేసుకుంటే వాటిని వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రధానంగా వచ్చిన వాటిలో ఆధార్ కార్డులోని పేరు, రుణఖాతాలోని పేరు వేరుగా ఉన్నవి, కుటుంబసభ్యుల నిర్ధారణ చేయవలిసి ఉన్నవి వచ్చాయి. ఆధార్‌లోని పేరు, రుణ ఖాతాలోని పేరు వేరుగా ఉండడం, కుటుంబంలో మినహాయింపు లేని ప్రభుత్వ ఉద్యోగి, కుటుంబ సర్వీసు పింఛన్‌దారుడు, పట్టా పాసుపుస్తకం లేకపోవడం, పట్టా పాస్‌పుస్తకం ఆధార్‌లోని పేరు, రుణ ఖాతాలోని పేరు వేరుగా ఉన్నవి వచ్చాయి. రేషన్‌కార్డు లేని వారు. డీబీటీ ఇష్యు, ఖాతా నెంబర్లు సరిగా లేనివి, ఆధార్‌లోని పేరు, రుణ ఖాతాలోని పేరు వేర్వేరుగా ఉన్నవి. మంజూరైన రుణం కన్నా డిసెంబర్ 9, 2023 నాటికి బకాయి ఉన్న వడ్డీ ఎక్కువగా ఉన్నది. ఇలాంటి ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. పేర్లు తప్పులు, ఆధార్‌లో ఒకటి క్రాప్ లోన్‌లో మరోటి ఉండడం. ఆధార్ నెంబర్ అనుసంధానం కానివి, ఆధార్‌కార్డుకు క్రాప్‌లోన్‌కు సరిపోని ఆధార్ నెంబర్, రేషన్ కార్డు లేకపోవడంతో వారికి మాఫీ కాలేదు. కొన్ని అనివార్య కారణాల వల్ల రైతు తన భూమిని అమ్ముకుంటారు. అమ్ముకునే సమయంలో మొత్తం క్రాప్‌లోన్ కడుతాడు. ప్రభుత్వ రుణమాఫీలో అతడికి రుణమాఫీ వస్తుంది. కానీ బ్యాంకర్లు ఆ రైతుకు రుణఖాతా లేదు కనుక రుణమాఫీ ఇవ్వమంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆ రైతుకు రుణమాఫీకి అర్హుడైనప్పటికీ బ్యాంకు అధికారులు ఇవ్వడం లేదు. ఇలా చాలామంది రైతులు ఉన్నారు.


# మల్లన్నసాగర్‌లోకి.. గోదారమ్మ

తొగుట, ఆగస్టు 8: సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని మల్లన్నసాగర్ ప్రాజెక్టులోకి గోదావరి పరవళ్లు మొదలయ్యాయి. గురువారం తుక్కాపూర్ పంప్‌హౌస్ నుంచి అధికారులు నాలుగు పంపులను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోస్తున్నారు. ఒక్కో పంప్ నుంచి 0.432 టీఎంసీల నీటిని మల్లన్నసాగర్‌లోకి పంపిస్తున్నారు. సముద్రాన్ని తలపించేలా బహుళ ప్రయోజనాలతో నిర్మించిన మల్లన్నసాగర్‌లో నీటినిల్వ సామర్థ్యం మరింత పెరిగి భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# కొండపోచమ్మ సాగర్‌కు నీటి విడుదల

- ఒక పంపుతో 1250 క్యూసెక్కులు ఎత్తిపోత
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

మర్కూక్, అగస్టు 8 : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగుకు నీరందిస్తారని వేచిచూస్తున్న రైతులకు కొండపోచమ్మ సాగర్‌లోకి నీటిని ఎత్తిపోస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాళేశ్వర జలాలతో కొండపోచమ్మ సాగర్‌ను నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని, మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డికి లేఖ రాసిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చి మల్లన్నసాగర్ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియను ప్రారంభించింది. గురువారం ఒక మోటరును ఆన్ చేయడంతో గోదావరి జలాలు కొండపోచమ్మ సాగర్‌లోకి పరుగులు పెట్టాయి. 15 టీఎంసీల సామర్థ్యం గల కొండపోచమ్మ సాగర్‌లో ఇప్పటికే 4.5 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఒక పంపు ద్వారా 1250 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తున్నారు. ఈనెల 11 వరకు నీటి లభ్యతను బట్టి గోదావరి జలాలు ఎత్తిపోస్తామని అధికారులు తెలిపారు. కొండపోచమ్మ సాగర్‌లోకి గోదావరి జలాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం రామాయంపేట కాల్వకు 100 క్యూసెక్కులు, యాదాద్రి జిల్లా తుర్కపల్లి కాల్వకు, జగదేవ్‌పూర్ కాల్వకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు.


మర్కూక్‌లోని కొండపోచమ్మ సాగర్‌లోకి వస్తున్న గోదావరి జలాలు

# ట్రిపుల్ ఆర్‌కు భూములివ్వం

- సంగారెడ్డి జిల్లా కొండాపూర్, సదాశివపేట మండలాల పరిధిలో రైతుల ధర్నా
- రైతుల అరెస్టు, స్టేషన్‌కు తరలింపు
- పోలీసు బందోబస్తు మధ్య భూసర్వే


పోలీసు బందోబస్తు మధ్య ట్రిపుల్ ఆర్ సర్వే చేస్తున్న అధికారులు

సదాశివపేట, ఆగస్టు 8: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వమని రైతులు తేల్చి చెప్పారు. భూములు కోల్పోతున్న తమకు భూమికి భూమి ఇవ్వాలని, లేకపోతే బహిరంగ మార్కెట్‌లో భూములకు పెరిగిన ధరల ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా కొండాపూర్ మండల పరిధిలోని గిర్మాపూర్, సదాశివపేట మండల పరిధిలోని పెద్దాపూర్ శివారులో అధికారులు డిజిటల్ భూ సర్వే నిర్వహించారు. సర్వేకు ఎలాంటి అడ్డంకులు తలెత్తకుండా ముందస్తుగా భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. త్రిబుల్‌ఆర్ రింగ్ రోడ్డు వల్ల జీవనోపాధి కోల్పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చి భూసర్వే చేయాలని డిమాండ్ చేశారు. తమ తాతల కాలం నుంచి వస్తున్న భూములను కోల్పోతే తమకు జీవనోపాధి లేకుండా పోతుందని, భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అనంతరం జాతీయ రహదారి 65పై ధర్నా నిర్వహించారు. ధర్నా చేస్తున్న రైతులను పోలీసులు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.


ధర్నా చేస్తున్న రైతులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

### భూమి ఇయ్యా..



నాది అయింత పోతున్నది. నాకు అద్దెకర భూమి ఉంది. భూమి ఇస్తే నేనెట్ల బతుకుడు. రోడ్డుకు భూమియ్యా. అందరిస్తే నేనిస్తా. భూమికి భూమి ఇవ్వాలి. లేదంటే బయట ఉన్న రేటు కట్టియ్యాలి. గట్లయితేనే ఇస్తా. లేదంటే ఇయ్యా.

- పార్వతమ్మ, గిర్మాపూపూర్

# రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

## బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్, ఆగస్టు 8: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తూ కాలం గడుపుతుందని, నేటికీ రైతుభరోసా ఇవ్వలేకపోయిందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుభరోసా సొమ్మును రైతు రుణమాఫీకి మళ్లించి రైతులకు ఇప్పటివరకు రైతుభరోసా ఇవ్వలేకపోయిందన్నారు. రాష్ట్రం లో రైతాంగం అప్పులు చేసి నాట్లు వేసుకుంటుంటే ఇప్పటివరకు కనీసం రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరానికి ఇవ్వాల్సిన రూ.15వేలు, కౌలు రైతులకు ఇస్తామన్న రూ.12 వేలు ఇవ్వలేదన్నారు. ఆంక్షలతో కూడిన పంట రుణమాఫీతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, చాలా మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. రేషన్ కార్డు మీద ఒక్కరికే రుణమాఫీ చేయడం చాలా దారుణమని, ప్రభుత్వ ఉద్యోగికి రుణమాఫీ చేయలేదన్నారు. ఇంట్లో రైతులు ఎంతమంది ఉన్నా వారందరికీ పంట రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కొర్రీలు పెట్టడంతోనే రైతులకు నూరుశాతం రుణమాఫీ కాలేదన్నారు. ఎన్నికల ముందు షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని ఎద్దేవా చేశారు. బ్యాంకర్లు రైతులకు సహకరించకుండా ఖాతాల్లో నిజమైన సొమ్మును వారికి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. రుణమాఫీకి 33 రకాల ఆంక్షలు పెట్టడం చాలా దారుణమన్నారు. ప్రాజెక్టు ద్వారా వెంటనే కూడవెల్లి, హల్దీ వాగుల్లోకి గోదావరి జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# బాధ్యతల నుంచి తొలిగిస్తాం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

పాపన్నపేట, ఆగస్టు 8: 'ఇన్‌చార్జి ఎంపీవో వేధింపులు' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో గురువారం ప్రచురితమైన వార్తకు డీపీవో యాదయ్య స్పందించారు. శుక్రవారం పాపన్నపేట ఎంపీవో వేణుగోపాల్‌ను డీపీవో కార్యాలయానికి పిలిపించి విచారణ చేస్తామని తెలిపారు. అందుకనుగుణంగా ఆయనను ఇన్‌చార్జి ఎంపీవో విధుల నుంచి తొలిగిస్తామన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో స్టాఫ్ తక్కువగా ఉన్నందున వేణుగోపాల్‌కు ఎంపీవో బాధ్యతలు అప్పగించామన్నారు. మరోవైపు పోలీసులు, ఇంటలిజెన్స్ వర్గాలు ఈ వార్తపై విచారణ జరిపాయన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి వివరాలు సేకరించారు.


మెడికల్ కళాశాలను సందర్శనలో మంత్రి దామోదర రాజనర్సింహ, అధికారులు

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- సంగారెడ్డిలో 500 పడకల దవాఖానకు త్వరలో శంకుస్థాపన చేస్తాం
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన తనిఖీ
- దవాఖాన పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశం

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 8: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, త్వరలో సంగారెడ్డిలో 500 పడకల దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డిలోని ప్రభుత్వ దవాఖానను కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖాన ఔట్ పేషంట్ విభాగాన్ని పరిశీలించి, నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. దవాఖాన శానిటేషన్‌పై ఆరా తీశారు. పరిశుభ్రత పాటించాలని, దవాఖాన సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. మెడిసిన్ స్టాక్‌రూమ్, డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించిన మంత్రి వైద్య విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని పేర్కొన్నారు. బాధ్యత, జవాబుదారితనంతో విధులు నిర్వర్తించాలన్నారు. రోగులతో కలిసిపోతూ వైద్య వృత్తికి న్యాయం చేయాలన్నారు. జబ్బుపడిన ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖాన చుట్టుపక్కల నుంచి వచ్చే ప్రజలకు గుండెకాయ లాంటిదని స్పష్టం చేశారు. దవాఖాన పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు దవాఖానలో ఇష్టారాజ్యంగా వైద్యం చేయకుండా మెడికల్ చట్టాలను పాటించాలని సూచించారు. జిల్లా దవాఖానలో అన్ని పరికరాలు, యంత్రాలను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ప్రభుత్వ దవాఖానలో వైద్యం చేయించుకోవాలని మంత్రి కోరారు. డయాలసిస్ బెడ్లు పెంచాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న హాస్టల్ భవనాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, ట్రైనీ కలెక్టర్ మనోజ్‌కుమార్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, ఆర్డీవో వసంతకుమారి, డీఎంఈ డాక్టర్ వాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని వినతి

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని మంజీరా స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు మాణయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. గురువారం సంగారెడ్డికి వచ్చిన మంత్రిని మంజీరా స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయన వినతిపత్రం అందజేస్తూ సంగారెడ్డిలో ఇండోర్ స్టేడియం,400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన క్రీడాకారులు ఉన్నారని, గతంలో ఉన్న స్పోర్ట్స్ అకాడమీలు క్రమంగా ఇక్కడి నుంచి తరలిపోయాయని వివరించారు.

# అధికారులపై జగ్గారెడ్డి ఫైర్

సంగారెడ్డి ఆగస్టు 8(నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం సంగారెడ్డిలోని వైద్య కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర సమక్షంలోనే సంగారెడ్డి మాజీఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి(జగ్గారెడ్డి) ఇంజినీరింగ్ అధికారులను మందలించారు. సంగారెడ్డి వైద్య కళాశాల నిర్మాణ పనులను మంత్రి దామోదర పరిశీలించారు. ఆయన వెన్నంటే కలెక్టర్ వల్లూరు క్రాంతి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఉన్నారు. వైద్య కళాశాల నిర్మాణ పనుల్లో జాప్యం జరగడంపై మంత్రి దామోదర అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సైతం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య కళాశాల నిర్మాణం పనులు పర్యవేక్షిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు నిధుల కొరత ఉందని, కాంట్రాక్టర్ పనులు చేయడంలో జాప్యం చేస్తున్నారని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే జగ్గారెడ్డి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మీరు కలిసి సమస్య వివరించారా? ఇంతవరకు మంత్రి దామోదరను ఎందుకు కలవలేదంటూ? అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఈ, ఎస్ఈ ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్ వెంటనే శుక్రవారం మంత్రి దామోదర రాజనర్సింహను కలవాలంటూ సూచించారు. ఏ సమస్యలున్నా మంత్రి దామోదరకు రిపోర్టు ఇవ్వాలని, అవసరమైన నిధులు కోరాలని తెలిపారు. నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలంటూ ఆదేశించారు. అయితే మంత్రి దామోదర సమక్షంలో జగ్గారెడ్డి ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులపై ఫైర్ అవడంపై అధికార వర్గాల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్నది.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 8: సీఎస్ఆర్ నిధులతో సంగారెడ్డి జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి జిల్లాలో రూ.160 కోట్ల సీఎస్ఆర్ నిధులు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. పరిశ్రమల శాఖ, జీఎంపెసీబీ, ఈడీ మైన్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిబ్బంది, విద్యాశాఖ, ఎక్సైజ్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో సీఎస్ఆర్ పనులు వేగంగా పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉన్నదన్నారు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, అధికారులు పాల్గొన్నారు.

# సత్తాచాటిన అథ్లెట్స్

## ముగిసిన నవోదయ క్లస్టర్ లెవల్ క్రీడలు

వర్గల్, ఆగస్టు 8 : సిద్దిపేట జిల్లా వర్గల్ జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయంలో రెండు రోజులపాటు జరిగిన క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ క్రీడలు గురువారంతో ముగిశాయి. తెలంగాణలోని నల్లగొండ, వరంగల్, మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల నవోదయ విద్యాలయాల నుంచి అథ్లెటిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు(బాల, బాలికలు) వందమందికిపైగా క్రీడాకారులు తరలివచ్చారు. అండర్ 17, అండర్19 విభాగాల్లో కలిపి 84 అంశాల్లో పోటీలు జరిగాయి. క్లస్టర్‌స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈనెల 12 నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరులో జరిగే రీజనల్‌స్థాయికి ఎంపిక చేశారు. క్రీడల ముగింపు సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోనే నవోదయ విద్యాలయాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆటలోనైనా, చదువులోనైనా నవోదయ విద్యాలయాల ఒరవడి ఇతర సంస్థలకు లేవన్నారు. విద్యాప్రమాణాలకు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు నవోదయ విద్యాలయాలు విద్యార్థుల పాలిట నిలయాలుగా మారాయన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా భావించి ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ రాజేందర్, నవోదయ ఉపాధ్యాయ బృందం


పరుగు పందెంలో పోటీ పడుతున్న విద్యార్థులు